# నీతులు చెప్పే పెద్దలకు పసివాడు చెప్పిన నీతి!

# సన్మానం

శశిశర్మ

కథ

చప్పట్లు మారుమోగుతున్నాయి. ఒక్కొక్కళ్లు వేదికమీదకి వచ్చి ఇస్తున్న దండలు, బొకేలు, కానుకలు, చిద్విలాసంగా నవ్వుతూ తీసుకుంటున్నారు ధర్మారావుగారు, రాష్ట్ర కాబినెట్ మంత్రిగారు. పార్టీ పెద్దలకి, తన నడవడికమీద నమ్మకం కాస్త సడలిందేమో అనే పరిస్థితిలో ప్రభుత్వం ప్రతిపాదించిన ఒక సరికొత్త పథకాన్ని, తాను రాష్ట్రంలో దిగ్విజయంగా అమలుచేయడమేకాక, దానికోసం పెద్ద మొత్తంలో కేంద్ర సహాయంకూడా మంజూరు చేయించుకు వచ్చాడు మరి. అందుకే ఈరోజు ఈ పౌరసన్మానం.

ముందు వరుసలో ఆయన భార్య, కొడుకు, కోడలు, మనవడు అందరూ ఆ కార్యక్రమంలో సంతోషంగా పాలుపంచుకుంటున్నారు. తన తాతయ్యకు జరుగుతున్న సన్మానాన్ని, ఆ కోలాహలాన్ని, అమాయకంగా గమనిస్తున్నాడు పదేళ్ల హరీష్, ధర్మారావుగారి మనవడు. తండ్రిలాగే రాజకీయంలో పార్టీలోని యువత విభాగానికి నాయకత్వం వహిస్తూ పలుకుబడి సంపాదించాడు. హరీష్ తండ్రి ధర్మారావుగారి ఏకైక సుపుత్రుడు శ్రీధర్ - తండ్రే అనుకుంటే తండ్రిని మించిన కర్కోటకుడని పేరు పొందినవాడు.

''సన్మానం ఘనంగానే జరుగుతోంది''

''ఆ ఎందుకు జరుగదూ. రెండు లక్షల పైగా ఖర్చుపెట్టాడుగా... ఆ మాత్రం జరగదా... అసలే పార్టీలో ఈయన పొజిషన్ బాగోలేదాయె! ఆ సంగతి మరి ప్రజలకు తెలీకూడదుగా''

గుసగుసగా ఎవరో అంటున్న మాటలు విని అదేమిటో అర్థంకాక అటువైపు చూశాడు హరీష్. ఎవరు అంటున్నారో తెలీలేదు. హరీష్ మనిషి ఇక్కడున్నాడేకాని మనసంతా ఇంట్లో జ్వరంతో పడివున్న పనికుర్రాడు రాముమీదే వుంది.



'పాపం ఎలా వున్నాడో... తనలాగే వాడికీ టెన్ ఇయర్స్. ఎప్పుడు పనీ పనీ అంటుంటాడు. ఇంట్లో అన్ని పనులు చేస్తాడు. అసలు ఆడుకోకు. కాని వాడికి ఆడుకోవాలంటే ఎంత ఇష్టమో! మమ్మీ మరి ఆడుకోనివ్వదుగా!

వాడిచేత ఎంత పని చేయిస్తుందీ! ఎంత బాగా చేసినా, వాడినీ మమ్మీ, నానమ్మ, తాతయ్య, డాడీ, డ్రైవరు శంకరం, అందరూ తిడుతుంటారు...

అప్పుడప్పుడూ కొడుతూ వుంటారుకూడా.

పాపం... ఏమీ అనకుండా ఏడుస్తూ పడుకుంటాడు. తనలాగే చదువుకోవాలని వుందిట వాడికి. లెక్కలు భలే ఫాస్ట్‌గా చేస్తాడు. మమ్మీకి తెలీకుండా, తన దగ్గర చదువు నేర్చుకుంటూ వుంటాడు. బాగా పాడతాడుకూడా. ఒకసారి అలా పాడుతుంటే డాడీ వచ్చి బుర్రమీద గట్టిగా కొట్టేశారు... ''వెధవా... పాటలు కావాల్సి వచ్చాయా... షూస్ పాలిష్ చేయకుండా పాటలు పాడుతున్నావా' అంటూ వాడి ఏడుపు చూస్తే తనకీ ఏడుపు వచ్చింది.

రాముకి అమ్మా, నాన్న లేరుట. చదువు చెప్పిస్తానని అబద్ధం చెప్పి, వాళ్ల మావయ్య డ్రైవర్ శంకరంకి అమ్మేశాడుట. వాడు తమ ఇంట్లో వీడిని పనికి కుదిర్చాడు. రామూ అంటే తనకి చాలా ఇష్టం. డాడీ, తాతయ్య ఇంట్లో వుండరు. మమ్మీ క్లబ్‌ల వెంట తిరుగుతుంది. నానమ్మకి ఎప్పుడు డబ్బులు, నగలు, తనకి ఇంతమంది ఆయాలు ఉన్నా బోర్ కొట్టేది. రాము వచ్చాక భలే బావుంది. ఇద్దరూ కలిసి బోలెన్ని కథలు చెప్పుకుంటూ వుంటారు. ''మన స్టేటస్ ఏమిటి? వాడితో నీకు ఫ్రెండ్‌షిప్ ఏంటి బాబూ... తప్పు అలా వాడితో ఎక్కువ మాట్లాడకు'' మమ్మీ కసిరేస్తుంది. అసలు స్టేటస్ అంటే ఏమిటో?

తనకి ఫ్రూట్స్, సలాడ్స్, జామ్‌లు అన్నీ ఇస్తుంది మమ్మీ. వాడికి కూడా పెడదామమ్మా అంటే ''ఇంకా నయం నన్ను తినిపించమన్నావుకాదు. వాడిని నెత్తిమీదకెక్కించుకోకు'' అంటూ తిట్టింది.

తాతయ్య, డాడీ ఎవరైనా స్నేహితులువస్తే రాముని నీట్‌గా తయారవమని వాళ్లందరికీ, అదేదో డ్రింకులు, ఐస్‌ముక్కలు, జీడిపప్పులు తెమ్మనమని చెప్తారు. ఒక్క నిమిషం లేటయితే తాతయ్య రాము చెంపమీద కొడతారు. ఎంత సేపైందిరా చెప్పి ఇడియట్'' అంటూ. రామూ ఏడుస్తూ పడుకుంటాడు. అలా కొట్టద్దని తను చెప్తే, ''నీకేం తెలీదు... నువ్వు చిన్నపిల్లాడివి... అలా కొడితేనే వాడు పనిచేస్తాడు'' అన్నాడు డాడీ. మరి రాముకూడా చిన్నపిల్లాడేగా!''

''హరీ... హరీ... తాతయ్య మైకుముందు నించుని మాట్లాడుతున్నారు. చూడు'' తల్లి కుదుపుకి ఈ లోకంలోకి వచ్చాడు హరీష్.

''మమ్మీ... రాముకి బాగా జ్వరంగా వుందికదా! ఎలా వున్నాడో... తొందరగా ఇంటికెళ్లిపోదాం'' హరీష్ అడిగాడు.

''ఛుప్... ఊరుకో. తాతయ్య స్పీచ్ వినరా అంటుంటే ఆ పని వెధవ గురించి ఆలోచిస్తావేంట్రా... వాడికేమీ అవ్వదు. దున్నపోతులా తింటాడు. వాడికే రోగమూ రాదు. పని ఎగ్గొట్టడానికి ఊరికినే వేషాలు'' శ్రీధర్ కసిరాడు.

రాము మూడు రోజులనుండి జ్వరంతో అంతలా బాధపడుతుంటే ఏదో పిచ్చి మాత్ర ఇచ్చారు డాడీ. ఏం తగ్గలేదు. దానితో డాక్టరుకి చూపించమంటే ''అనవసరం'' అంటూ వెళ్లిపోయారు. జ్వరంతో వణుకుతున్నాడు వాడు. పని ఎగ్గొట్టడానికి వేషం ఎందుకు వేస్తాడు? మైకులో ధర్మారావుగారి కంఠం వినగానే అటుకేసి చూశాడు హరీష్.

''సోదర సోదరీమణులారా... ఈరోజు నాకెంతో సంతోషంగా వుంది. మన ప్రభుత్వం ప్రతిపాదించిన ''బాలల అభ్యున్నతి'' పథకాన్ని, మీ అందరి సహాయ సహకారాలవల్ల మన రాష్ట్రంలో దిగ్విజయంగా అమలు పరచగలిగాను. అది మునుముందు ఇంకా సక్రమంగా అమలులోకి వస్తుందన్న నమ్మకం నాకుంది.

అసలా పథకం ఏమిటి? దానిని నేను ఎంత కష్టపడి అమలుపరుస్తున్నాను, ఆ వివరాలు మీకీరోజు చెప్పదల్చుకున్నాను.

మీ అందరికీ తెలుసు. నేటి బాలలే రేపటి భావిభారత పౌరులు. మన దేశానికి, సమాజానికి పేరుప్రఖ్యాతులు తెచ్చిపెట్టే ఆశాదీపాలు వీరు. ఈ రోజు ఇటువంటి చిన్నారుల పరిస్థితి దేశంలో ఎలా వుంది? ఎక్కడచూసినా బాలకార్మికుల సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంది. కర్మాగారాలలో, బిల్డింగ్ కట్టడాలలో, షాపులలో, హోటళ్లలో, రైల్వే స్టేషన్లలో, చిన్నారి పిల్లలు పనులు, కూలీ చేస్తూ మనకి రోజూ కనిపిస్తూనే వుంటారు. అక్కడిదాకా ఎందుకు, ఎంతమంది ఇళ్లల్లో చిన్న చిన్న పిల్లలు పనివాళ్లుగా బ్రతకడంలేదు?

హాయిగా ఆడుతూ పాడుతూ చదువుకుంటూ బాల్యం గడపాల్సిన ఈ సమయంలో పనిపేరిట తమ శ్రమని, శక్తిని ధారపోస్తున్నారు వాళ్లు. వీరిని హీనంగా, నీచంగా కేవలం పనివాళ్లు అనే దృష్టితో సరైన తిండి, బట్ట ఇవ్వక దారుణంగా ప్రవర్తిస్తున్నారు పెద్దలు, అలా చూస్తున్నారుకూడా. అటువంటివారి భవిష్యత్తు ఏమిటి?''

''ఈ పిల్లలలో ఎంతోమంది కళాకారులు, క్రీడాకారులు, మేధావులు వుండి వుంటారు. వారికి మరి మనమిచ్చే గుర్తింపేమిటి?

ఇలాంటివారి కోసమే, పని అనే ఆ బంధిఖానానుండి విముక్తినిచ్చి, వారిని సరైన దారిలో పెట్టడంకోసం, అనేక సంక్షేమ హాస్టళ్లు, స్కూళ్లు, ఆసుపత్రులు కట్టించి, అందులో అన్ని వారికి ఫ్రీగా అంటే ఉచితంగా లభించేలా చేస్తుంది. అంటే చదువు, తిండి, బట్ట, వైద్యం అన్నీ పిల్లలకి ఉచితంగా లభిస్తాయన్నమాట. దానికోసం నేను కేంద్రంనుండి ఎన్నో కోట్లు మంజూరు చేయించుకుని వచ్చాను''

''ప్రభుత్వం ఈ బాలలయొక్క బాధ్యతను తీసుకుంటుంది. ప్రతి ఊరిలో వారికి సహాయ కార్యక్రమాలు చేపట్టబడతాయి. కేవలం చదువేకాదు. ఆట, పాట, అనేక లలితకళలు వారికి నేర్పిస్తాం. ముమ్ముందు, స్వయం ఉపాధి పథకాలకి కూడా అవకాశం కల్పిస్తాం. ఇప్పటికీ, చాలామంది పిల్లలు ఈ సదుపాయాలన్నీ పొందుతున్నారు. మీరందరూకూడా దురదృష్టవంతులైన

## ఒక్కటే

''కొడుక్కైనా, కూతురుకైనా అయ్యే ఖర్చు ఒక్కటేనని ఇప్పటికి తెల్సుకున్నావా. ఎలా?''

''అబ్బాయికి రెండు లక్షలుపెట్టి డాక్టరు సీటు, అమ్మాయికి రెండు లక్షలు పెట్టి డాక్టర్ సంబంధం కొన్నాక!''

- అండె అనిత (చిత్తూరు)



ఇటువంటి పిల్లలు మీకేగనుక ఎదురవుతే మానవత్వంతో మీ జిల్లా అధికారులను కలుసుకుని, తద్వారా వారికేదైనా సహాయం చేయడానికి ప్రయత్నించండి. మన దేశానికే దీపాలైన వీరిని కష్టపెట్టకండి. మానవత్వంతో మెలగండి.''

''సమాజ సేవే నా ఊపిరి. నా ఊపిరి వున్నంతవరకు నేను మీ కోసమే బ్రతుకుతాను. నా జీవితాన్ని మీకే అంకితం చేస్తున్నాను. ఈ పౌరసన్మానాన్ని జరిపిన, ఇందులో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికి నా కృతజ్ఞతలు. జైహింద్'' అంటూ ముగించారు ధర్మారావుగారు. ఒక్కసారి ఆ ప్రదేశమంతా చప్పట్లతో మారుమ్రోగిపోయింది.

''ధర్మారావుగారికి జై'' అంటూ నినాదాలు మిన్నుముట్టాయి. సభా కార్యక్రమం అయిపోయాక, సెక్యూరిటీ గార్డుల సహాయంతో ధర్మారావు కుటుంబ సభ్యులు అందరూ కార్లలో ఇంటికి బయలుదేరారు.

కారులో జరిగిన సన్మానాన్ని, వచ్చిన కానుకల గురించి ఆపకుండా అత్తగారితో గొప్పగా చర్చించుకుంటున్న తల్లిని అడిగాడు హరీష్.

''మమ్మీ... పిల్లలకోసం తాతయ్య హాస్టళ్ళు, స్కూళ్ళు అన్నీ కట్టిస్తున్నారా... అందులో ఎవరైనా చేరచ్చా!!

''అవునమ్మా... తాతయ్య చాలా గొప్పవారుకదా... అందుకే మరి, అలాంటి హాస్టళ్లు అవీ పిల్లలకోసం కట్టిస్తున్నారు. బీదపిల్లలు అందులో చేరవచ్చు'' తల్లి చెప్పింది విన్నాడు.

''మరి డబ్బెక్కడిది... తాతయ్య దగ్గర వుందా?'' అడిగాడు.

''ఓరి పిడుగా... అన్నీ కావాలి... గవర్నమెంట్ బోల్డంత డబ్బు ఇస్తుంది. అది పెట్టి కట్టిస్తారు. ఇప్పటికే అలాంటివి చాలా కట్టించారుకూడా'' నానమ్మ అన్న మాటలకి ఏదో ఐడియా వచ్చినట్లు తలూపాడు హరీష్. కారు ఇంటిముందు ఆగిందో లేదో ఒక్క ఉదుటున డోర్ తెరిచి దిగి మూలనున్న వరండావైపు పరుగెట్టాడు హరీష్.

అక్కడే చిన్న చాప మీద పడుకున్న రాము దగ్గరకు వెళ్లి కుదుపుతూ

''రామూ...రామూ ఎలా వుంది నీకు?'' అడిగాడు. ఒళ్లు సలసలా కాలిపోతోంది రాముకి. మెల్లగా కళ్లు తెరిచి చూశాడు హరీష్‌వైపు.

''రామూ జ్వరం తగ్గిందా... మరే... నువ్వింక మా ఇంట్లో పనిచేయక్కర్లేదు. ఇప్పుడే మా తాతయ్య మైకులో నీలాంటి పిల్లలందరికీ హాస్టళ్లు అవీ కట్టిస్తున్నామని చెప్పారు. తెలుసా?''

అంత జ్వరంలో, ఆ మాటలు మందులా పనిచేశాయి రాముకి.

''చినబాబు... నిజమా... పెదబాబుగారు అలా చెప్పారా?''

''అవునురామూ... నీకు చదువు, ఆటలు, పాటలు అన్నీ ఫ్రీగా నేర్పిస్తారుట, ఆ హాస్టల్లో. నువ్వు పాపం మా ఇంట్లో పనిచేసి అలిసిపోతున్నావుగా. అందుకే చూడు... నీకు జ్వరం వచ్చింది. సోనీలే నీ జ్వరం తగ్గిన వెంటనే మా డాడీవాళ్లతో మాట్లాడి, హాస్టలులో జాయిన్ అవుదుగానిలే'' ఉత్సాహంగా అన్నాడు హరీష్.

''నువ్వు చానా మంచోడివి చినబాబూ... నేను బాగా చదువుకుంటాను. పెద్ద ఉద్యోగం చేత్తాను. నన్ను ఆ హాట్టల్లో సేర్పించు. మరి చినబాబూ.... '' రాము మాట ఇంకా పూర్తవ్వకుండానే, అతని వీపుమీద దబీదబీమని గుద్దులు పడ్డాయి. కెవ్వుమని అరిచాడు.

ఎదురుగా డ్రైవరు శంకరం.

''ఏరా దొంగనాకొడకా... నీకు సదువుకావాలీ... నీ అయ్య నాకమ్మింది నీకు సదువుకోడానికా... అదీ చినబాబుతో సెప్తావా...

ఆ బాబుకేటీ తెలీదు. నువ్వు ఆయనోరి దగ్గర ఇట్టా వాగుతావా... నీకిక్కడ ఏటిరా కట్టం'' అంటూ చెవులు మెలేయసాగాడు.

''ఏయ్... శంకర్ ఆగు... వాడికసలే జ్వరం... ఎందుకలా కొడతావు...రాము చదువుకుంటే నీకేంటి?'' అరిచాడు హరీష్.

''మీరూరుకోండి చినబాబు. మీకేటి తెల్దు. ఇంత బాగా పనిచేసేవోడు వదులుకుంటే మళ్లీ దొరుకుతాడేటి? పనోళ్లు పనోళ్లే. ఆడికి సదువెందుకు...'' ఏరా మళ్లీ మళ్లీ సదువు అంటావా'' జుట్టు పట్టుకుని గుంజాడు.

''ఏంట్రా గొడవ... ఏంటైందిరా'' హుంకరిస్తూ వచ్చారు ధర్మారావుగారు.

''అబ్బే ఏటీ లేదు. బాబుగారూ ఈ దొంగెదవ సదువుకుంటాడుట. పని మానేత్తాడుట. ఇక్కడ బాగా కట్టపడి పోతున్నాడట'' శంకరం అన్నాడు.

గజగజా వణికిపోయాడు రాము.

''లేదు బాబుగారూ... నాకేం తెలీదు. చినబాబుగారు, మీరేదో హాట్టళ్లు అవీ నాలాటి పిల్లలకోసం కట్టిత్తారు. అందులో అందరూ సదుకోవచ్చు అని అన్నారు బాబు. నాకు సదువు వద్దు ఏటీ వద్దు బాబు... నేనీడే పనిసేసుకుంటా.. నాకిలాగే బాగుంది. నాకు సదువు వద్దు బాబు... శంకరం మావని కొట్టద్దని సెప్పండి బాబుగారు'' అంటూ పెద్ద పెట్టున ఏడవసాగాడు.

''తాతయ్య. ప్లీజ్... రాముకి చదువు చెప్పిద్దాం... ఆ హాస్టలులో జాయిన్ చేద్దాం. రాముని ఇక్కడ పనిచేయించకండి. నాలాగే వాడూ చిన్నపిల్లాడు తాతయ్యా'' హరీష్ ఆయన చేతులు లాగుతూ బ్రతిమాలుతున్న ధోరణిలో అన్నాడు.

ఎవరో ఛెళ్లున చెంపమీద కొట్టినట్లనిపించింది ధర్మారావుగారికి ఆ మాటలు వింటుంటే. ముఖాన కత్తివాటుకు నెత్తురుచుక్క లేదు. బాలల అభ్యున్నతి పథకం. తను నిజంగా అమలుపరచగలిగాడా... అసలు తను ఎక్కడ మొదలుపెట్టాడు. నీరసంగా, దీనంగా ఏడుస్తున్న రాముని చూశాడాయన.

''రామూ... ఊరుకో నీ జ్వరం తగ్గాక నిన్ను హాస్టల్లో చేర్పిస్తాను. బాగా చదువుకుందువుగాని. ఏడవకు'' నెమ్మదిగా అన్నారు. ఆయనలా నెమ్మదిగా అంటుంటే ఆశ్చర్యంగా చూశాడు శంకరం.

''నిజమా తాతయ్యా... నిజ్జంగా నువ్వు హాస్టల్లో చేర్పిస్తావా రాముని?'' గెంతినంత పనిచేశాడు హరీష్.

''నిజంగా నాన్నా... రాముని మంచి హాస్టల్లో జాయిన్ చేద్దాం. బాగా చదువు చెప్పిద్దాం. సరేనా''

''మా తాతయ్య చాలా మంచివాడు. యు ఆర్ గ్రేట్ తాతయ్య'' షేక్ హాండ్ ఇస్తున్నట్లుగా చెయ్యి ఊపుతూ అన్నాడు హరీష్.

ఇందాకటి సన్మానంకన్నా హరీష్ అన్న ఆ ఒక్క ఆ మాటవల్ల ధర్మారావుగారికి అనిర్వచనీయమైన ఆనందం కలిగింది. నవ్వుతూ మనవడిని ముద్దుపెట్టుకున్నారు.

★ ★ ★

